పీయూలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలకు పూజలు చేస్తున్న రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఆచార్యులు

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయంలో బతుకమ్మ సంబురాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు బతుకమ్మలను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. సాయంత్రం వారి బతుకమ్మలను ఒక దగ్గరకు చేర్చారు. రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, మహిళా ఆచార్యులు బతుకమ్మలకు పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు.



విశ్వవిద్యాలయంలో బతుకమ్మలతో విద్యార్థినులు



అలంకారంలో జోగులాంబ అమ్మవారు

బ్రహ్మచారిణిగా జోగులాంబ

అలంపూర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రెండో రోజు జోగులాంబ అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవీ నవరాత్రుల్లో శుక్రవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు రోజూ ఆలయంలో ఆర్జిత సేవలు నిర్వహిస్తున్నారు. ఉదయం సహస్రనామార్చన, కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణ అర్చన, చండీహోమం, రాత్రి 7 గంటలకు కొలువు పూజలో భాగంగా సువాసిని, కుమారి పూజలను అర్చకులు నిర్వహించారు. అంతకు ముందు జోగులాంబ ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ రథంపై ప్రదక్షణ నిర్వహించారు. ఈవో పురేందర్, అర్చకులు, ధర్మకర్తల సభ్యులు పాల్గొన్నారు.

వృథాగా గిరిజన ఉద్యోగినుల వసతి గృహం



మహబూబ్‌నగర్ : ఎదిర వద్ద రూ.2.75 కోట్లతో నిర్మించిన వసతి గృహ భవనం

న్యూస్‌టుడే, పాలమూరు : ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న గిరిజన మహిళా ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహం వృథాగా మారింది. భారాస పాలనలో రూ. 2.75 కోట్లతో నాలుగు అంతస్తులతో విశాలమైన 16 గదులు, ఆధునాతన వసతులతో దీన్ని నిర్మించారు. 2018లో ఫిబ్రవరి 26న పనులను ప్రారంభించి మూడేళ్లలో పూర్తి చేశారు. 2021 డిసెంబర్ 21న లాంఛనంగా ప్రారంభించారు. మహబూబ్‌నగర్ పట్టణం నుంచి మూడు కి.మీ.ల దూరంలోనే ఈ భవనం ఉంది. మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ వైపు నుంచి నేరుగా ఈ భవనం వద్దకు రావడానికి అనేక మార్గాలు ఉన్నాయి. మొదట్లో కొంత మంది మహిళా ఉద్యోగులు ఉన్నారు. తర్వాత ఉద్యోగినులు రాకపోవటంతో ఈ ఏడాది మార్చి వరకు కళాశాల విద్యార్థినులు ఉన్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థినులు కూడా రాలేదు. అప్పన్నపల్లి వద్ద రెండో ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో సరైన దారి లేక ఈ వసతిగృహానికి రావడానికి ఇబ్బందులు పడ్డారు. ఈ కారణంగా ఇక్కడ ఉండటం మానేశారు. ఇప్పుడు సమస్య లేకపోయినా ఆ విషయం తెలియక ఎవరూ రావటం లేదు. గిరిజన సంక్షేమ శాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా అటకెక్కింది. రక్షణగా వాచ్‌మెన్ ఉన్నా.. బోరు మోటారు చోరీకి గురైంది. కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. భవనం వినియోగంలో లేకపోతే శిథిలావస్థకు చేరుకునే ప్రమాదముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఇక్కడి 180 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భవనాన్ని పాఠశాలకు కేటాయించాలని ఎదిర గ్రామస్థులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే యెన్నం దృష్టికి తీసుకెళ్లగా ఆయన కలెక్టర్‌తో మాట్లాడుతానని చెప్పారని పేర్కొన్నారు.

గిరిజన విద్యార్థులకు వినియోగిస్తాం.. : తెలంగాణ గిరిజన మహిళా ఉద్యోగుల వసతిగృహాన్ని గిరిజన బాలురు ఉండేందుకు వినియోగిస్తాం. బోయపల్లి సమీపంలో వృత్తి శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్న భవనంలో గిరిజన విద్యార్థులు ఉన్నారు. వారిని ఇక్కడికి మార్చడానికి చర్యలు తీసుకుంటాం.

- ఛత్రునాయక్, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి, మహబూబ్‌నగర్

పింఛను లేదని ధ్రువపత్రం ఇవ్వండి

మహబూబ్‌నగర్ పట్టణం : ఆదిలాబాద్ రీజియన్‌లో లాగా తమకు 'నో పింఛను' ధ్రువపత్రం జారీ చేయాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం నేతలు ఆర్ఎం వి.శ్రీదేవికి విన్నవించారు. ఆర్టీసీలో పింఛను ఇవ్వకపోయినా రేషన్ కార్డులు, పింఛన్లకు అర్హులు కాలేకపోతున్నామని, పింఛను లేదని ధ్రువీకరిస్తే దరఖాస్తు చేసుకుంటామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు, జీబీ పాల్, నారాయణ, నాగాంజనేయులు, జేఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలకు అత్యంత ప్రాధాన్యం

ఎస్‌జీఎఫ్ కుస్తీ పోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే పర్ణికరెడ్డి


రెజ్లింగ్ పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ధన్వాడ, న్యూస్‌టుడే : తమది క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వమని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. శుక్రవారం ధన్వాడ అప్పాజీ మైదానంలో 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కప్‌లోనూ రెజ్లింగ్‌కు అవకాశం కల్పించామన్నారు. ధన్వాడలో రెజ్లింగ్ హాలు నిర్మాణం కోసం రూ.11 లక్షలు కలెక్టరు కేటాయించారన్నారు. డీవైఎస్‌వో వెంకటేశ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ రియాజ్, ధన్వాడ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, పేట మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సదాశివరెడ్డి, ఉపాధ్యక్షుడు హన్మంతు, డైరెక్టర్లు రాంచంద్రయ్య, రాగ్యానాయక్, లక్ష్మయ్యగౌడ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కుస్తీ ప్రారంభం


ధన్వాడ, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా ధన్వాడలోని అప్పాజీ మైదానంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) బాలికల రెజ్లింగ్(కుస్తీ) పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు 300 మంది పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారులు పోటీలకు దూరంగా ఉన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి జాతీయ పతాక ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభం కాగా ఆదిలాబాద్ క్రీడాకారులు వందన సమర్పణ చేస్తూ ముందుకు కదిలారు. మహబూబ్‌నగర్ క్రీడాకారులతో ఈ కార్యక్రమం ముగిసింది. తదుపరి ఎమ్మెల్యే పోటీలను లాంఛనంగా మొదలెట్టారు. మధ్యాహ్నం పెద్ద వర్షం పడటంతో మైదానంలో పోటీల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది.

హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా కొనసాగాయి. బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లాల నుంచి పది జట్లు పోటీపడగా కరీంనగర్ - మహబూబ్‌నగర్ మొదటి సెమీ ఫైనల్, ఆదిలాబాద్ - వరంగల్ జట్లు ద్వితీయ సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. చివరికి కరీంనగర్, ఆదిలాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో మొదటి సెమీ ఫైనల్‌లో మహబూబ్‌నగర్ - వరంగల్ జట్లు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్‌లో కరీంనగర్ - హైదరాబాద్ మ్యాచ్ శనివారం మొదటి సెషన్‌లో ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, నర్సిములు, శ్రీనివాస్, రఫత్ పాల్గొన్నారు.

విస్తీర్ణంలో దేశంలో రెండో అతి పెద్ద పులుల అభయారణ్యం నల్లమల. అరుదైన వన్యప్రాణులు, పక్షులు, వృక్షాలు, ఔషధ మొక్కలకు నెలవు. 2611 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ఏటీఆర్‌లో ఎంతో జీవవైవిధ్యం కనిపిస్తుంది. కర్ణాటక సరిహద్దు కృష్ణా తీరం కూడా జీవ జాతులకు ఆలవాలమే. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు సందర్భంగా ఇక్కడి విశేషాలు తెలుసుకుందాం.

జీవుల ఆలవాలం.. నీలపాలి కలకాలం


మద్దిమడుగు రేంజ్‌లో కనిపించే అరుదైన చింకార


మూషిక జింకలు


ధన్వాడలో శుక్రవారం నిర్వహించిన వన్యప్రాణుల సంరక్షణ ర్యాలీ

న్యూస్‌టుడే- అమ్రాబాద్, కృష్ణా

ఉమ్మడి పాలమూరు జిల్లా అరుదైన వన్యప్రాణులకు ఆలవాలం. అందులోనూ నల్లమల ప్రత్యేకం. సుమారు 180 కిలోమీటర్ల సరిహద్దుగా ఉన్న కృష్ణానది వేసవిలో జంతుజాలం దప్పిక తీరుస్తూ కాపాడుతోంది. అటవీ అధికారుల చర్యల మూలంగా 10 లోపు ఉన్న పెద్ద పులుల సంఖ్య 38కి చేరుకుంది. క్రమేపీ ఇతర జంతువుల సంఖ్య పెరుగుతోంది. అంతరించి పోయే దశలో ఉన్న జంతుజాతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నల్లమలలో పెద్దపులులతో పాటు జింకలు, మనుబోతులు, దుప్పులు, చిరుతపులులు, అడవి పందులు, ఎలుగు బంట్లు, కొండగొర్రెలతో పాటు ఎన్నో జాతుల జంతువులు నివసిస్తున్నాయి.

ఏం చేస్తున్నారు?

ఒకప్పుడు నల్లమలలో విస్తారంగా ఉన్న మూషిక జింకలు వివిధ కారణాల వల్ల అంతరించి పోయాయి. వానిని పునరుద్ధరించేందుకు అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శన శాల నుంచి తెప్పించి అభివృద్ధి పరుస్తున్నారు. ఇందులో భాగంగా మన్ననూరు రేంజ్‌లోని పిచ్చకుంట్లోని చెరువు ప్రాంతంలో ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసి అందుకు అనువైన వాతావరణ పరిస్థితులు కల్పిస్తున్నారు. ఒక్కొక్క బ్యాచ్‌కు 6 ఆడ, 2 మగ మూషిక జింకల చొప్పున 17 బ్యాచులు హైదరాబాద్ నుంచి తెచ్చి నల్లమల వాతావరణానికి అలవాటయ్యే వరకు షెడ్డుల్లో పెంచి నెల తర్వాత అడవిలో వదులుతున్నారు. క్రమేపీ వాటి సంఖ్య పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. అటవీప్రాంతం పొడుగునా ప్లాస్టిక్ నిషేధించారు.


చికారాలు ప్రత్యేకం

కృష్ణ జింకలను పోలి ఉండే చింకారాలు ఏటీఆర్‌కే ప్రత్యేకం. నల్లమలలోని మద్దిమడుగు రేంజ్‌తో పాటు కవ్వాల్ పెద్దపులుల అభయారణ్యంలో మాత్రమే ఇవి కనిపిస్తాయి. వంపులు తిరిగిన కొమ్ములు, బెదురు చూపులతో అత్యంత పిరికిగా ఉండే చింకారాల అభివృద్ధికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈప్రాంతంలో ఉండే పశువులు, గొర్రెల మందలు వాటి అభివృద్ధికి ఆటంకంగా మారాయి. అడవిలో లభించే మేతను పశువులు, గొర్రెలు తినిపోవటంతో ఇవి ఆహారం కోసం ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఈప్రాంతంలో పశువులు, గొర్రెల మందలను అధికారులు నియంత్రిస్తున్నారు. వేటగాళ్లపై ప్రత్యేక నిఘా ఉంచటంతోపాటు తాగునీటి వసతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఆవాసాల్లోకి మొసళ్లు, జింకలు

గత 30 ఏళ్ల క్రితం వరకు జింకలు, మొసళ్లను వేళ్లపై లెక్కించేవారు. ఇప్పుడు వాటి సంతతి గణనీయంగా పెరిగింది. నీటి లభ్యతతో పాటు విరివిగా ఆహారం లభించడంతో సంతతి గణనీయంగా పెరిగింది. మొసళ్ల విషయానికి వస్తే మొసలి పిల్ల చాలా చిన్నదిగా ఉంటుంది. నదిలో నుంచి నీరు ఎత్తిపోసే క్రమంలో ఆయా మోటార్ల ద్వారా పంట కాలువలలోకి చేరి సమీపంలోని చెరువులలోకి చేరుతున్నాయి. మనిషి అత్యధికంగా కోడి మాంసం తింటూ ఉండటంతో వాటి వ్యర్థాలు స్థానిక చెరువులు, నీటి కుంటలలో పార వేస్తున్నారు. దీంతో మొసళ్లకు మంచి ఆహారం లభిస్తుండటంతో జనావాసాలలోకి చేరుతున్నాయి. ఒకప్పుడు కర్ణాటక సరిహద్దులో కనిపించే జింకలు ఇప్పుడు పూర్తిగా గ్రామాల శివార్లలోకి చొచ్చుకొచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ మధ్య ఊట్కూరు వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఈ సమస్యపై రైతులు మొరపెట్టుకున్నారు. కృష్ణా మండలం ముడుమాల్ వద్ద జింకల సంరక్షణ కోసం 70 ఎకరాల స్థలం కేటాయించారు. రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆ తరువాత ఈ కేంద్రం ఏర్పాటు ముందుకు సాగలేదు. ప్రజలకు జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అటవీశాఖాధికారి నీలేష్ 'న్యూస్‌టుడే'తో అన్నారు.

నీటి కుక్కలు


కృష్ణానదిలోని నీటి కుక్కలు

నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి నాగార్జునసాగర్ వరకు ఉన్న సుమారు 180 కిలో మీటర్ల పొడవైన కృష్ణానదితో పాటు లింగాల, తెలకపల్లి ప్రాంతాల్లో నీటి కుక్కలు కనిపిస్తాయి. చేపలు, ఎండ్రగిచ్చలు ఆహారంగా తీసుకునే నీటి కుక్కలు మత్స్యకారులు చేపల కోసం వేసే వలలో చిక్కుకుని మృతి చెందుతుంటాయి. ఈకారణంగా నానాటికి నీటికుక్కలు అంతరించి పోయే అవకాశం ఉంది. ఇవే కాకుండ పసుపు గొంతు బుల్‌బుల్ పిచ్చుక, స్పాట్ బెల్లీడ్ డేగ-గుడ్లగూబ, బ్లాక్ బాజా లాంటి అరుదైన పక్షి జాతులు నల్లమలలో ఉన్నాయి.

అండర్-19 క్రికెట్ ఫైనల్‌కు పాలమూరు జట్టు

సెమీస్‌లో ఖమ్మంపై 60 పరుగుల తేడాతో ఘన విజయం


సెమీస్‌లో నెగ్గి ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ (క్రీడలు), న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 రాష్ట్రస్థాయి టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ఫైనల్‌కు చేరింది. శుక్రవారం వనపర్తిలోని మెగారెడ్డి మైదానంలో నిర్వహించిన సెమీస్‌లో ఖమ్మం జట్టుపై 60 పరుగుల తేడాతో నెగ్గింది. జిల్లా జట్టు నుంచి అబ్దుల్ రాఫె 110 పరుగులతో ఆకట్టుకున్నాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన పాలమూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జిల్లా జట్టు నుంచి అబ్దుల్ రాఫె 110 (146 బంతుల్లో 4×11, 6×2) సాయంతో శతకం బాదాడు. కె.సాహిల్ 45, నరేశ్ 25, షాదాబ్ అహ్మద్ 22 పరుగులు చేశారు. అనంతరం ఖమ్మం జట్టు 39.3 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌట్ అయింది. మహబూబ్‌నగర్ జట్టు నుంచి ముఖీత్ 4, బి.రాజు, శశాంక్, షాదాబ్, సాహిల్ ఒక్కో వికెట్ తీశారు. శనివారం ఫైనల్‌లో జిల్లా జట్టు కరీంనగర్‌తో తలపడనుంది. ఫైనల్‌కు చేరిన జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా, సంఘం సభ్యులు అభినందించారు.

అర కోటితో అలంకారం.. ఆకట్టుకునే రూపం



కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. రూ.50 లక్షలు విలువజేసే నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌శెట్టి, సభ్యులు పాల్గొన్నారు. వరదేల శమీవృక్షం వద్ద ఉన్న దుర్గామాతను గాయత్రి అవతారంలో అలంకరించారు.

అలంపూర్ ఆలయాల ఛైర్మన్‌గా నాగేశ్వర్‌రెడ్డి


ఆలయాల నూతన ధర్మకర్తల సభ్యులు, చిత్రంలో సంపత్‌కుమార్

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాల నూతన ధర్మకర్తల కమిటీ సభ్యులతో శుక్రవారం ఈవో పురేందర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆలయ ఛైర్మన్‌గా కొంకల నాగేశ్వర్‌రెడ్డి పేరును ప్రతిపాదించారు. అందరూ ఆమోదించడంతో ఏకగ్రీవంగా ఛైర్మన్‌గా ఆయన ఎన్నికయ్యారు. ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు కమిటీ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఛైర్మన్‌ను మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మిఠాయి తినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడిన వారికి పదవులు ఉంటాయన్నారు. ఆర్డీఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత దంపతులు, టెలికం సలహా సంఘం సభ్యుడు ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఐక్యత, ఆరోగ్యం


ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అంజయ్యయాదవ్. చిత్రంలో నవీన్‌కుమార్‌రెడ్డి, నరేందర్ తదితరులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: క్రీడల ద్వారా ఐకమత్యం, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, అలాంటి ఆటలకు నిత్యం కొంత సమయం కేటాయించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్ మినీస్టేడియంలో భారాస నాయకుడు నందారం అశోక్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఎంచుకున్న క్రీడలో రాణించాలని క్రీడాకారులను కోరారు. ఈ టోర్నమెంట్ 15 రోజులపాటు జరుగుతుందని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 70 టీంలు ఇందులో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ నరేందర్, వైస్‌ఛైర్మన్ నటరాజ్, శ్రీనివాస్‌గౌడ్, సుధీర్, బచ్చుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వసతుల కల్పనకు చర్యలు


దేవరకద్రలో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : గ్రంథాలయాలకు వస్తున్న పాఠకులకు పోటీ పరీక్షల పుస్తకాలు, అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసకుంటామని గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డా.రియాజ్ అన్నారు. శుక్రవారం రాత్రి మహబూబ్‌నగర్ పట్టణం మెట్టుగడ్డలోని కేంద్ర గ్రంథాలయాన్ని, దేవరకద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడున్న పాఠకులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డా.రియాజ్ గ్రంథాలయంలో సమస్యలపై యువతను ఆరాతీయగా భవనాన్ని విస్తరించాలని, మరిన్ని కుర్చీలు, పోటీపరీక్షల కొత్త పుస్తకాలు, మాసపత్రికలను సమకూర్చాలని కోరారు. మహబూబ్‌నగర్, నారాయణపేట గ్రంథాలయాల కార్యదర్శులు మనోజ్‌కుమార్, సురేశ్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలో భారీ కుంభకోణం

- సభ్యులకు తెలియకుండానే వారి పేర్లపై రుణాలు
- లబోదిబోమంటున్న మహిళలు

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : పాలమూరు పురపాలిక 17వ వార్డు కోయనగర్ శ్రీసాయి మహిళా సంఘాల సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్ - స్లమ్ లెవల్ ఫెడరేషన్)లో భారీ కుంభకోణం వెలుగు చూసింది. మహిళా సంఘాల పొదుపు ఖాతాలు పర్యవేక్షించే ఓ ఆర్పీ సభ్యులుగా ఉన్న మహిళలకు తెలియకుండానే వారి పేర్ల మీద భారీ మొత్తంలో రుణాలు తీసుకుని అవకతవకలకు పాల్పడ్డారు. దీనిపై ఎస్ఎల్ఎఫ్ పరిధి పలు సంఘాల మహిళలు పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కూడా కలిసి ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన ఎమ్మెల్యే వెంటనే కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌పై విచారణ చేయించినా మెప్మా అధికారులకు సూచించారు. మెప్మా డీఎంసీ శివకుమార్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌లో మహిళల పొదుపు సొమ్ముతో పాటు రుణాల పేరిట ఆర్పీ పెద్ద మొత్తంగా అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఎమ్మెల్యే, పుర కమిషనర్ ఆదేశాలతో ముగ్గురు సీవోలు, నలుగురు సీనియర్ ఆర్పీలతో కూడిన మూడు బృందాలను ఏర్పాటు చేసి శనివారం నుంచి కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌పై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. అవకతవకలు వాస్తవమేనని, ఇటీవల కొంత మంది మహిళలు ఆర్పీపై ఫిర్యాదు చేయడంతో నయానా భయానా రూ.6 లక్షల వరకు సొమ్ము రికవరీ చేయించానని వార్డు కౌన్సిలర్ జంగమ్మ 'న్యూస్‌టుడే'తో చెప్పారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో మిగతా సంఘాల వాళ్లు కూడా అక్రమాలు జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

బ్యాంకు అధికారులు ఏం చేసినట్లు?

కోయనగర్ ఎస్ఎల్ఎఫ్ పరిధిలో 32 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10 నుంచి 15 వరకు మహిళలు సభ్యులుగా ఉన్నారు. సభ్యులు బ్యాంకు లింకేజీ కింద రుణాలు తీసుకోవాలంటే వారి పేర్లతో ఆర్పీ సూక్ష్మ రుణ ప్రణాళిక (ఎంసీపీ - మైక్రో క్రెడిట్ ప్లాన్) తయారు చేసి ఒక్కో సభ్యురాలి సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. ఎంసీపీని బ్యాంకులో సమర్పించాక క్షేత్రాధికారి (ఫీల్డ్ ఆఫీసర్) పరిశీలించి ఆయా మహిళలతో మాట్లాడి మరోమారు వారి సంతకాలు తీసుకుని వారి ఖాతాల్లోనే రుణ మొత్తం జమ చేయాలి. ఇందుకు భిన్నంగా జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకుకు చెందిన క్షేత్రాధికారి ఆర్పీ చెప్పినట్లు విని మహిళల సంతకాలు తీసుకోకుండానే ఒక్కో మహిళ పేరు మీద రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు మంజూరు చేసి నిధులు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ఇలా 32 సంఘాల్లోని చాలా మంది సభ్యుల పేర్ల మీద వారికి తెలియకుండానే ఆర్పీ పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నట్లు మహిళలు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం నిర్వహించే విచారణకు అన్ని సంఘాల సభ్యులు బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఇతర దస్త్రాలతో హాజరు కావాలని సూచించామని, విచారణలో అవకతవకలు పూర్తిస్థాయిలో బహిర్గతం అయ్యే అవకాశం ఉంటుందని మెప్మా డీఎంసీ పేర్కొన్నారు.

నకిలీ మావోయిస్టును పట్టించిన సాంకేతికత


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గిరిధర్‌రావు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : నక్సలైట్‌నని ఓ రైస్‌మిల్లు వ్యాపారిని బెదిరించి ఫోన్‌పే ద్వారా డబ్బు తీసుకున్న ఓవ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శుక్రవారం వనపర్తి కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అలియాస్ ప్రమోద్‌రెడ్డి ఇటీవల వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం సోలీపూర్ గ్రామానికి చెందిన మిల్లు యజమాని శేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి తాను మాజీ నక్సలైట్‌నని. రైస్‌మిల్లు అసోసియేషన్ నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండు చేశారు. డబ్బులివ్వకుంటే చంపుతానని బెదిరించారు. ఈ నెల రెండో తేదీన హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని కమిషన్ బేస్డ్ వ్యక్తికి చెందిన ఫోన్‌పే నంబరుకు రూ.8 వేలు జమ చేయాలని శేఖర్‌రెడ్డికి చెప్పారు. బాధితుడు రూ.8 వేలు పంపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఖిల్లాగణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడు డబ్బు తీసుకునేందుకు కమిషన్ బేస్డ్ వ్యక్తి ఇంటి వద్దకు రాగా కొత్తకోట సీఐ రాంబాబు, ఖిల్లాగణపురం ఎస్సై సురేశ్‌గౌడ్ పట్టుకున్నారు. అతన్ని విచారించగా నేరం ఒప్పుకొన్నాడు. నిందితుడు పెద్దపల్లిలో సుల్తానాబాద్, కరీంనగర్, సుబేదారి, మిర్యాలగూడ ప్రాంతాల్లో కొందరిని బెదిరించి డబ్బు తీసుకోవడంతో కేసులు నమోదయ్యాయి. కేసును త్వరగా ఛేదించిన కొత్తకోట సీఐ, ఖిల్లాగణపురం ఎస్సై, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వీరికి రివార్డు ఇస్తామన్నారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐతో పాటు వనపర్తి సీఐ నాగభూషణంరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

అయిజ, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారికి సహకరిస్తున్న అయిజ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.కృష్ణయ్యను సస్పెండ్ చేస్తూ ఎస్పీ టి.శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు చేశారు. బాధ్యతారాహిత్యం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం కారణంగా శాఖాపరమైన చర్యలు చేపట్టారు. రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వారికి సహకరిస్తున్నాడని వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన అనంతరం రుజువుకావడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని ఎస్పీ కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో తెలిపారు.

ఒకే రోజు ముగ్గురిపై శునకాల దాడి


గాయాలపాలైన రేవంత్

మానవపాడు, న్యూస్‌టుడే: ఒకే రోజు ముగ్గురు వ్యక్తులపై శునకాలు దాడిచేశాయి. అమరవాయి గ్రామానికి చెందిన పరశురాముడు కుమారుడు రేవంత్ శుక్రవారం ఉదయం పాల ప్యాకెట్ తీసుకురావడానికి ఇంటి నుంచి దుకాణానికి బయలు దేరాడు. వెళ్తున్న క్రమంలో రేవంత్‌పై కుక్కల గుంపు దాడికి పాల్పడింది. బాలుడు గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు, కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని శునకాలను చెదరగొట్టారు. అప్పటికే బాలుడిని కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు రేవంత్‌ను కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన రామదాసు కుమారుడు శివపైనా కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. పెద్దఆముదాలపాడు గ్రామానికి చెందిన రామకృష్ణ వ్యక్తిగత పనుల నిమిత్తం వస్తుండగా అమరవాయిలో శునకాలు దాడి చేసి గాయపరిచాయి. వీరిద్దరూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. గ్రామాల్లో శునకాల స్వైరవిహారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు
మహబూబ్‌నగర్: 9948145978 జడ్చర్ల: 8008573899
దేవరకద్ర: 9000031648 భూత్పూర్: 8008563143

తెరపై ఈనాడు
తిరుమల - దేవర, వెంకటేశ్వర - దేవర, వెంకటాద్రి - సత్యం సుందరం, శ్రీకృష్ణ - జోకర్ (ఉదయం ఆటలు) దక్షిణ (రాత్రి ఆటలు) – న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

ప్రజా సంక్షేమానికే పెద్దపీట: ఎమ్మెల్యే



జానంపేటలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల, న్యూస్‌టుడే: ఇందిరమ్మ పాలనలో ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలంలోని జానంపేటలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.1.8 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం.. ఆరు గ్యారంటీల అమలుతో గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శెట్టి శేఖర్, బిక్షపతి, చెన్నయ్య, శివరాములు, కృష్ణయ్య, రాంకుమార్‌యాదవ్, వెంకటేష్, వెంకటయ్య యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు న్యాయవాదుల విధుల బహిష్కరణ

జడ్చర్ల, న్యూస్‌టుడే: మాచర్లపేటలో అబ్దుల్ సలీం అనే న్యాయవాదిపై పోలీసుల దాడికి నిరసనగా శుక్రవారం జడ్చర్ల కోర్టులో వరుసగా రెండో రోజు న్యాయవాదులు తమ విధుల బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ న్యాయవాద రక్షణ చట్టం తీసుకొచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందని, న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మాలిక్ షాకిర్, మహేశ్వర్‌రెడ్డి, విశ్వేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, రమేష్, ప్రశాంత్, పురుషోత్తం, హఫీజ, ఇమ్తియాజ్‌ అలీ, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

గొంతులో కణితి తొలగింపు


ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అరుదైన చికిత్స

పాలమూరు, న్యూస్‌టుడే: స్వరపేటికలో కణితి ఏర్పడి ఇబ్బందులు పడుతున్న ఓ బాలుడికి మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు గురువారం అరుదైన శస్త్ర చికిత్స చేసి తొలగించారు. శుక్రవారం ఆసుపత్రి వర్గాలు వివరాలు వెల్లడించాయి. నారాయణపేట జిల్లాకు చెందిన 16 ఏళ్ల చేతన్ కొంతకాలంగా గొంతు నొప్పితో బాధ పడుతున్నాడు. ఈ నెల 2న మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి రాగా సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ పరీక్షలు చేశారు. స్వరపేటికలోని నాడులపై ఎడమ వైపు ఉన్న గింజంత కణితి ఉందని లారింగోస్కోపీ ద్వారా గుర్తించారు. దాని వల్లనే గొంతు నొప్పితో పాటు మాటలు బొంగురుపోవడం తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతుండటంతో బాలుడికి మైక్రో లారింజియల్ అనే ఆపరేషన్ చేసి కణితి తొలగించారు. బాలుడిని శుక్రవారం డిశ్చార్జి చేశారు. ఆపరేషన్‌లో ఈఎన్‌టీ డాక్టర్లు శ్రీకాంత్, వైష్ణవి, రామకృష్ణ, అనస్థీషియా వైద్యులు మాధవి, అలీ, సంజీవ్, భారతి పాల్గొన్నారు.


మహబూబ్‌నగర్ : వాసవీమాత ఆలయంలో..


వేంకటేశ్వరాలయంలో..


జడ్చర్ల: బంగారు మైసమ్మ ఆలయంలో..


సకల దేవతల ఆలయంలో..


జడ్చర్ల: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


దేవరకద్ర: లక్ష్మీపల్లిలో..


మహబూబ్‌నగర్ : కిద్వాయిపేటలో దుర్గామాతకు పూజలు చేస్తున్న మహిళలు

కరుణించవమ్మా.. కనకదుర్గమ్మా


జడ్చర్ల: సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి భక్తుల పూజలు


మహబూబ్‌నగర్ : రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

మహబూబ్‌నగర్ పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం దుర్గామాత ప్రతిమలను అన్నపూర్ణాదేవిగా, గాయత్రీ మాతగా అలంకరించి పూజించారు. వీరన్నపేటలోని చౌడేశ్వరీమాత ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా పూజలందుకున్నారు. బ్రాహ్మణవాడ వాసవీమాత ఆలయంలో దేవి గాయత్రీమాతగా దర్శనమిచ్చారు. శ్రీనివాసకాలనీలోని వాసవీమాత ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, పద్మావతికాలనీలో కాళికాదేవి, నాగేంద్రనగర్‌లోని అభయాంజనేయస్వామి, వేంకటేశ్వర, లక్ష్మీనగర్‌కాలనీలోని శ్రీరాజరాజేశ్వరిమాత, కొత్తగంజ్ నృసింహస్వామి ఆలయంలో దుర్గామాత వివిధ అవతారాల్లో దర్శనమిచ్చారు. జడ్చర్లలోని కన్యకాపరమేశ్వరి, సంతోషిమాతతో పాటు వివిధ ఆలయాల్లో దుర్గామాత విగ్రహాలను వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పరమేశ్వరీదేవి వెండి ఉత్సవ విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. పర్వాతాపురం మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమిస్తాపూర్‌లోని శ్రీజ్ఞానసరస్వతి ఆలయంలో లలితాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. దేవరకద్రతో పాటు గూరకొండ, నాగారం, వెంకటాయపల్లి, గద్దెగూడెం గ్రామాల్లో దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీపల్లిలోని శ్రీసరస్వతీదేవి విద్యాక్షేత్రంలో పూజలు చేశారు. బాలానగర్, నవాబ్‌పేట, అడ్డాకుల, మూసాపేట, గండీడ్ మండలాల్లో పూజలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే బృందం**


జడ్చర్ల: పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


మహబూబ్‌నగర్ : సింహగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తుల పూజలు


బాలానగర్: గంగాధర్‌పల్లిలో భక్తులు


నవాబ్‌పేట: రుద్రారంలో పూజలు చేస్తున్న భక్తులు


గండీడ్: మన్సూర్‌పల్లితండాలోని తుల్జాభవనీ ఆలయంలో..


జేపీఎన్‌సీఈ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


దేవరకద్ర: గూరకొండలో అమ్మవారి సన్నిధిలో..


మహబూబ్‌నగర్ : పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో..

ముగిసిన పోలీసు నైపుణ్యాల ప్రదర్శన


మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులకు బహుమతి అందిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఎస్పీ డి.జానకి, ఏఎస్పీ రాములు.

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌లో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా పోలీస్ నైపుణ్యాల ప్రదర్శన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ హాజరై పలు పోటీల్లో ప్రతిభ చాటిన పోలీసులకు బహుమతులను అందించారు. సాంకేతిక పరిజ్ఞానం, నేర పరిశోధన, క్రిమినల్ లా, రాతపరీక్ష, మౌఖిక పరీక్ష, వేలిముద్రలు, నేరం జరిగిన చోటు ఫొటోగ్రఫీ, వాహనాల తనిఖీ, నేరం జరిగిన గదుల పరిశీలన, జాగిలాలతో నేరశోధన తదితరాల్లో పోలీసులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. మహబూబ్‌నగర్ పోలీసులు ఎక్కువ విభాగాల్లో ప్రతిభ కనబరచడంతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అవార్డు దక్కించుకున్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్, వనపర్తి ఎస్పీ గిరిధర్, గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు, నాగర్‌కర్నూల్ అదనపు ఎస్పీ రామేశ్వర్, అదనపు ఎస్పీలు రాములు, సురేశ్‌కుమార్, రామ్‌దాస్‌తేజ, రియాజ్ ఉల్ హక్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, వెంకటరమణారెడ్డి, సుదర్శన్, నర్సింహులు, నరేందర్‌రావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేగంగా కుటుంబ డిజిటల్ సర్వే


సద్దలగుండు ప్రాంతంలో అధికారులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

భూత్పూర్, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డు ప్రక్రియలో భాగంగా ఎంపిక చేసిన వీధి, కాలనీలో త్వరితగతిన వివరాలు వివరాలు సేకరించాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా భూత్పూర్‌లో కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి శుక్రవారం ఉదయం ఆమె పరిశీలించారు. సర్వే సభ్యులతో పాటు ఇంటి యజమానులతో మాట్లాడారు. సర్వే అధికారులు ఏమేమి వివరాలు అడుగుతున్నారని ఆరా తీశారు. పుర కమిషనర్ సురేందర్‌రెడ్డి, ఉప తహసీల్దార్ గీత, ఆర్ఐ నర్సింహ, పుర సిబ్బంది పాల్గొన్నారు.

జడ్చర్ల, న్యూస్‌టుడే: డిజిటల్ సర్వేను వేగవంతం చేయాలని, పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జడ్చర్లలోని 24వ వార్డులోని రంగరావుతోట పద్మావతి కాలనీలో అధికారులు చేపట్టిన డిజిటల్ సర్వేను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, పుర కమిషనర్ రాజయ్య, కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలమూరు పురపాలకం : కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో ఒక్క ఇల్లు కూడా తప్పరాదని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సూచించారు. 37వ వార్డు సద్దలగుండు ప్రాంతంలో కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించారు. కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, గ్రామీణ, అర్బన్ తహసీల్దార్లు ఘన్సీరాంనాయక్, సుందర్‌రాజ్ సర్వేను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

వివరణ ప్రకటనపై ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు మరియు సంబంధించిన వ్యక్తులకు మరియు శ్రీ వీరబ్రహ్మాచారి అడ్వకేట్ మహబూబ్‌నగర్ గార్కి తమరి వివరణ ప్రకటన తేది:16-09-2024 ఈనాడు తెలుగు దినపత్రికకు జవాబుగా నా క్లయింట్స్ అయిన చౌదరి మల్లమ్మ W/o చిన్న అంబయ్య, గుర్రంపల్లి మాధవి @ రమాదేవి W/o గుర్రంపల్లి అంజనేయులు మరియు ఉమాదేవి @ ఉమారాణి W/o సత్తయ్యగౌడ్ ప్రస్తుత నివాసము మహబూబ్‌నగర్ గారి తరపున ప్రతిజవాబుగా తెల్పునది ఏమనగా పై తెల్పిన నా యొక్క క్లయింట్స్ తమ హక్కుల గురించి కోర్టులో దావానెం.18/24 గౌరవ నాల్గవ అదనపు జిల్లా కోర్టు మహబూబ్‌నగర్‌లో భాగ పరిష్కారం గురించి కేసు వేసినట్లు తేది 12-09-2024 నాడు ప్రకటన 13-09-2024న ఈనాడు తెలుగు దినపత్రికలో తెల్పిన విషయాలు వాస్తవాలు ఇట్టి విషయంలో నిజానిజాలు నిర్ధారణ చేయు అధికారములు ఒక్క గౌరవ న్యాయ స్థానానికి మాత్రమే కలదు. మిగతా వ్యక్తి లేదా వ్యక్తులకు కోర్టు పరిధిలో ఉన్న విషయాల గురించి నిర్ణయం చేసే అధికారాలు ఎవ్వరికీ లేదు అంతేకాక మా ప్రకటనలు తేది 13-09-2024లో వ్రాసిన విషయాలు నిజాలు అంతేకాక కోర్టు నుండి ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నట్లు మా ప్రకటనలో తెల్పలేదు. కావున ఇట్టి విషయాలలో ఎవ్వరేగాని తొందరపాటు చర్యలు మా క్లయింట్స్ పై విషయాల గురించి తీసు కొన్నయడల వారిపై మా క్లైంట్స్ చట్టపరమైన కఠినచర్యలు తీసుకోగలరు. ఒకవేళఇందుకు విరుద్ధంగా ఎవ్వరేగాని నడిచినా వారే బాధ్యులుకాగలరు.
తేది: 04-10-2024, మహబూబ్‌నగర్

ఇట్లు
కె.ఆనంద్‌రావ్ అడ్వకేట్
H.No: 1-2-123/3/C, స్టేషన్‌రోడ్,
మహబూబ్‌నగర్, సెల్ నెం. 9441016518

ధ్రువపత్రాల పరిశీలనకు గడువు నేడే


డైట్ కళాశాలలో డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయేందిర బోయి

పాలమూరు, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 మెరిట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 2 నుంచి జిల్లా కేంద్రంలో కొనసాగుతోంది. మూడు రోజుల నుంచి 486 మంది అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన పూర్తయ్యింది. ఒక రోజే గడువు ఉండగా ఇంకా 90 మంది హాజరు కావాల్సి ఉంది. మొత్తం ఈ డీఎస్సీ ద్వారా 243 పోస్టులకు 1:3 నిష్పత్తిలో 576 మంది అభ్యర్థులను ఎంపిక చేసి జాబితాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపించారు. కొన్ని విభాగాల్లో, రిజర్వేషన్లలో అర్హులు లేకపోవటంతో 1:2 నిష్పత్తిలో ఎంపిక చేశారు. అందుకే మెరిట్ జాబితాలో అభ్యర్థుల సంఖ్య తగ్గింది. స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన 20 పోస్టుల విషయం కోర్టు పరిధిలో ఉండటంతో వాటికి అభ్యర్థులను ఎంపిక చేయలేదు. శుక్రవారం రాత్రి వరకు 486 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయితే 438 మంది అభ్యర్థుల వివరాలను అంతర్జాలంలో పొందుపరచినట్లు డీఈవో రవీందర్ తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందన్నారు. అభ్యర్థులు త్వరగా వచ్చి తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవాలని ఆయన సూచించారు.

రావాల్సిన డీఎస్సీ అభ్యర్థులు 90 మంది

ఇబ్బందులు లేకుండా ప్రక్రియ పూర్తిచేయండి..

పాలమూరు, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిచేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. విద్యుత్తు సరఫరా లేక ఇబ్బందులు పడిన వైనంపై 'చీకట్లోనే ధ్రువపత్రాల పరిశీలన' శీర్షికతో శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన 12 ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. అక్కడి వసతులపై డీఈవో రవీందర్‌ను, అక్కడ విధులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంలను ఆరా తీశారు. ఎంత మంది ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చారు. ఇంకా ఎంత మంది రావాల్సి ఉందని అడిగారు. ధ్రువపత్రాల పరిశీలనకు రాని వారికి చరవాణి ద్వారా సమాచారం అందించి వచ్చేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. స్కూల్ అసిస్టెంట్లలో మొదటి ర్యాంకులు, వివిధ విభాగాల్లో రిజర్వేషన్లు ఉన్నవారు వచ్చారని, ర్యాంకులు వచ్చినా పోస్టులు లేకపోవడంతో పలువురు రాలేదని జీహెచ్ఎంలు కలెక్టర్‌కు వివరించారు. అయినా వారిని పిలవాలని జీహెచ్ఎంలకు కలెక్టర్ సూచించారు. ఇప్పటి వరకు ఎంత మంది వచ్చారో తనకు నివేదిక ఇవ్వాలని డీఈవోను ఆదేశించారు.

ఉదయం నుంచే డీఈవో పర్యవేక్షణ...: ప్రభుత్వ డైట్ కళాశాలకు శుక్రవారం ఉదయమే డీఈవో చేరుకున్నారు. అక్కడే ఉండి అన్ని పనులు పర్యవేక్షించారు. అక్కడి పరిసరాలను శుభ్రం చేయించడమే కాకుండా, తాళం వేసి ఉన్న అదనపు గదులను కూడా తెరిపించారు. అందులో అభ్యర్థులు, వారి సహాయకులు ఉండేలా ఏర్పాట్లు చేశారు. కళాశాలలో గదుల వద్ద ఇనుప గ్రిల్స్‌కు ఉన్న దుమ్ము, ధూళి ఉండటంతో సిబ్బంది శుభ్రం చేశారు. అభ్యర్థులకు తాగునీరు, ఇతర సదుపాయాలను డీఈవో ఏర్పాటు చేయించారు.

సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ ప్లాంట్ వద్దు


ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యుత్తు ఉద్యోగులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించి విద్యుత్తు ఉత్పత్తి చేయాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విద్యుత్తు ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఈ కార్యాలయం ఎదుట ప్లకార్డులు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రామగుండంలో థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి ద్వారా నిర్మించి రాబోవు రోజుల్లో అదే సంస్థతో విద్యుదుత్పత్తి ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. జెన్‌కోను కనుమరుగు చేసే కుట్రను తిప్పికొడతామన్నారు. ఏడీఈలు నవీన్‌కుమార్, చంద్రశేఖర్, ఏఈలు వెంకటరమణ, సోమశేఖర్, కార్మిక నాయకులు స్వామి, బాబియానాయక్, బల్‌రాం, వెంకట్రాములు, విజయ్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు శ్రీ ముద్దనోల శ్రీనివాసులు తండ్రి ముద్దనోల లక్ష్మయ్య, వృత్తి: వ్యాపారం, R/o ఇ.నెం.96/A, పాలకొండ గ్రామం, మహబూబ్‌నగర్ మరియు శ్రీ జూరు వల్లయ్య తండ్రి జూరు ఎల్లప్ప, వృత్తి: వ్యాపారం, R/o ఇ.నెం.4-6, పాలకొండ గ్రామం, మహబూబ్‌నగర్ గార్లు 09-03-2021 తేదీనాటి విక్రయ ఒప్పందమును అమలు చేయమని కోరుతూ స్పెసిఫిక్ పర్‌ఫార్మెన్స్ కొరకు దిగువ తెలిపిన సరిహద్దులతో చూపబడిన షెడ్యూల్ ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా, పాలకొండ గ్రామం మరియు మండలం వద్ద సర్వే నెం. 245/Eలోని భూమికి సంబంధించి శ్రీమతి పార్వతమ్మ భర్త కీ.శే. కె.హన్మంతు, R/o. ఇ.నెం.95, రోడ్ నెం.2, పార్క్ దగ్గర, హౌసింగ్ బోర్డు కాలనీ, కొత్తబస్‌స్టాండ్ సమీపాన, జడ్చర్ల వారిపై గౌరవనీయ IV అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి, మహబూబ్‌నగర్ వారి సమక్షంలో O.S.No.29/2024 ద్వారా దావా దాఖలు చేయడమైనది.

గౌరవనీయ IV అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి, మహబూబ్‌నగర్ వారి సమక్షంలో సర్వే నెం.245/Eలోని భూమికి సంబంధించి శ్రీమతి పార్వతమ్మపై వేసిన O.S.No.29/2024 సివిల్ కేసు అపరిష్కృతంగా ఉన్నదని సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. పార్వతమ్మ పేరిటగల సర్వే నెం.245/Eలోని పై సదరు ఆస్తి కొనుగోలు చేయడం, అభివృద్ధి చేయడం లేదా ఏ విధమైన ఒప్పందాలను కుదుర్చుకోవడం వంటి ఏవేని లావాదేవీలను చేయరాదని లేదా జరుపరాదని ఇందుమూలముగా సూచించడమైనది. ఈ నోటీసును విస్మరిస్తూ పార్వతమ్మ యొక్క సర్వే నెం.245/Eలోని ఆస్తితో ఎవరైనా లావాదేవీలు చేసినట్లయితే, వారు వారి స్వంత పూచీతో చేసినవారవుదురు మరియు నా క్లయింటుచే తీసుకోబోవు క్రిమినల్ మరియు సివిల్ చర్యలకు వారు బాధ్యులవుదురు. ఈ నోటీసును విస్మరిస్తూ, సర్వే నెం. 245/Eలోని భూమికి సంబంధించి పార్వతమ్మతో ఎవరేని వ్యక్తి ఎలాంటి లావాదేవీలు జరిపిన పక్షంలో, వాటికి నా క్లయింటు బాధ్యత వహించరు. సదరు లావాదేవీలు నా క్లయింట్లను కట్టడి చేయజాలవు మరియు అవి చెల్లనివిగా మరియు రద్దయినవిగా భావించబడును.

ఆస్తి షెడ్యూల్:

మహబూబ్‌నగర్ జిల్లా పాలకొండ వద్ద సర్వే నెం.245/E లోని ఎ.0-30 గుంటల విస్తీర్ణపు భూమి మరియు సరిహద్దులు: తూర్పు: సర్వే నెం.245/Eలోని మహమ్మద్‌అలీ భూమి, పడమర: సర్వే నెం. 245/Eలోని మిగితా భూమి, ఉత్తరం: వెంకటయ్యకు చెందిన భూమి, దక్షిణం: సర్వే నెం.245/Eలోని మిగితా భూమి.

మహబూబ్‌నగర్ జిల్లా, పాలకొండ గ్రామము వద్ద సర్వే నెం. 245/Eలో ఎ.0-20 గుంటల విస్తీర్ణపు భూమి మరియు సరిహద్దులు: తూర్పు: సర్వే నెం.244లోని భూమి, పడమర: పాలకొండ 40-00" అడుగుల రోడ్, ఉత్తరం: సర్వే నెం. 244లోని భూమి, దక్షిణం: సర్వే నెం.245లోని కుర్మయ్య భూమి.
మహబూబ్‌నగర్
తేది: 04-10-2024

సం/-., **జి.కార్తీక్,** బి.టెక్, ఎల్ఎల్.బి., అడ్వకేట్
ఇ.నెం.7-4-5/2, వెంకటేశ్వర కాలనీ, మహబూబ్‌నగర్
ఫోన్ నెం: 9989629394

ఫుట్‌బాల్ టోర్నీ పరిశీలకుడిగా వడెన్న



మహబూబ్‌నగర్ క్రీడలు : కొత్తగూడెంలో ఈనెల 5 నుంచి నిర్వహించనున్న పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) 68వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్-17 టోర్నీకి పరిశీలకుడిగా జిల్లాకు చెందిన వ్యాయామ అధ్యాపకుడు వడెన్న ఎంపికయ్యారు. ఈయన బాదేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్నారు. వడెన్నను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి, పీఈటీల సంఘం ప్రతినిధులు జగన్ మోహన్‌గౌడ్, నిరంజన్ రావు, వేణుగోపాల్, రమేశ్‌బాబు, పరశురాం, రాజవర్ధన్‌రెడ్డి అభినందించారు.

కౌకుంట్ల తహసీల్దార్‌గా నాన్యనాయక్

దేవరకద్ర గ్రామీణం : కౌకుంట్ల తహసీల్దార్‌గా నాన్యనాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కౌకుంట్ల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎల్లప్ప చిన్నచింతకుంటగా బదిలీపై వెళ్లారు.

నేటి నుంచి తంజీమే ఇన్సాఫ్ సమావేశాలు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: తంజీమే ఇన్సాఫ్ జాతీయ సమితి సమావేశాలు ఈనెల 5,6 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎండీ ఫయాజ్ వెల్లడించారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆహ్వాన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టం సవరణ బిల్లును ఆగమేఘాల మీద తీసుకువచ్చిందన్నారు. రెండు రోజుల సమావేశాలకు జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ అజీజ్ పాషా, జాతీయ ప్రధాన కార్యదర్శి డా.అయూబ్ అలి ఖాన్, అలీఘడ్ వర్సిటీ మాజీ ఉప కులపతి అహ్మద్ షేర్వాణి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుసేని, ఎమ్మెల్యే యెన్నం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ కొత్వాల్ హాజరవుతారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పాలమూరు, న్యూస్‌టుడే: డీఎస్సీ ద్వారా నియామకమవుతున్న ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధకులు లేని పాఠశాలలకు కేటాయించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం సంఘం నాయకులు గోపాల్‌నాయక్ అత్తర్ అహ్మద్, స్వామి, వైవీ రావుతో కలిసి డీఈవో రవీందర్‌కు వినతిపత్రం సమర్పించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో.. : డీఎస్సీ-2008లో ఉమ్మడి జిల్లాలో అర్హత కలిగిన 9 మంది అభ్యర్థుల వివరాలు జాబితాలో లేవని, వాటిని వెంటనే నమోదు చేయాలని యూటీఎఫ్ నాయకులు డీఈవోను కోరారు. నాయకులు కిష్టయ్య, వెంకటేశ్, నరేశ్, 2008 డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

చౌకధర దుకాణం తనిఖీ

మిడ్జిల్, న్యూస్‌టుడే: మండలంలోని వెలుగొమ్ముల గ్రామ చౌకధర దుకాణాన్ని మండల అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన పలువురు డీలరు అక్రమాలకు పాల్పడుతున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఈ మేరకు ఆర్ఐ అంబిక దుకాణాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సరకుల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. డీలరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ సరకులు ఇవ్వడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు.

నీటి సమస్యను తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోండి

గండీడ్, న్యూస్‌టుడే: గ్రామాల్లో భగీరథ నీటి సమస్యను తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు 4 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చేతి పంపులు, స్టార్టర్లు, లీకేజీలకు సంబంధించిన పనులపై వారికి అవగాహన కల్పించారు.

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో మంచినీటి సరఫరాలో నీటి సరఫరా సహాయకులు కీలకపాత్ర పోషించాలని ఈఈ పుల్లారెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసన

జడ్చర్ల, న్యూస్‌టుడే: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన నర్సింగానంద స్వామి అనుచిత వ్యాఖ్యలు చేశారని జడ్చర్లలో శుక్రవారం ఓ వర్గం ప్రజలు పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం నిర్వహించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన స్వామిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఐ ఆదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వివిధ ప్రాంతాల యువకులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

రాజాపూర్, న్యూస్‌టుడే: ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై కె.రవి కథనం ప్రకారం.. మండలంలోని రంగారెడ్డిగూడకు చెందిన కాటేపాగ మురళి(26) పోలేపల్లి పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో కూలీగా పనిచేస్తూ స్థానికంగా అద్దె ఇంట్లో ఉంటున్నారు. గురువారం భార్యతో గొడవపడి స్వగ్రామంలోని తల్లి వద్దకు వచ్చాడు. రాత్రి సమయంలో ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మురళి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీ బోల్తా పడి ఇద్దరికి గాయాలు

అడ్డాకుల : అదుపుతప్పిన లారీ బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ వెంకట్‌గోవిందుమోరే, క్లీనర్ సుక్‌దేవ్‌లు లారీలో యూరియా లోడుతో గుజరాత్ నుంచి తిరుపతికి బయలుదేరారు. ఈ క్రమంలో లారీ శుక్రవారం తెల్లవారుజామున మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారుకు చేరుకోగానే డ్రైవర్ నిద్రలోకి జారుకున్నాడు. దీంతో లారీ అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవరు, క్లీనర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

అడవిపందిని ఢీకొట్టడంతో ఒకరికి..

గండీడ్, న్యూస్‌టుడే: అడవి పందిని ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో గాయాలైన ఘటన మండలంలోని సల్కర్‌పేట్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. సల్కర్‌పేట్ గ్రామానికి చెందిన నరేశ్ పంచాంగల్ తండాకు వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన అడవి పందిని ఢీకొనడంతో కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కడీలు తొలగించిన వారిపై కేసు నమోదు

నవాబ్‌పేట : అక్రమంగా పొలంలో పాతిన కడీలను, ఫినిషింగ్ తీగను తొలగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చౌడూర్ గ్రామ శివారులోని పొలంలో కడీలను పాతి ఫినిషింగ్ చేయించగా ఇదే గ్రామానికి చెందిన ఊగుంట శ్రీనివాస్ కడీలను, ఫినిషింగ్ తీగను తొలగించి ధ్వంసం చేశాడు. ఈ విషయమై బాధితుడు దండు నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

బియ్యం స్వాధీనం

హన్వాడ, న్యూస్‌టుడే : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం కోయిలకొండ మండలం కొత్లాబాద్‌కు చెందిన జి.శ్రీను, జమాల్‌పూర్‌కు చెందిన రాములుగౌడ్ తమ ఆటోల్లో 6.5 క్వింటాళ్ల బియ్యాన్ని వేపూర్ సమీపంలోని రైస్ మిల్లుకు తరలిస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు పౌర సరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లటంతో ఆర్ఐ చైతన్య వచ్చి పరిశీలించారు. ఆర్ఐ ఫిర్యాదు మేరకు పోలీసులు బియ్యం స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

ఇసుక టిప్పర్, పొక్లెయిన్ పట్టివేత

హన్వాడ, న్యూస్‌టుడే : చిన్నదర్పల్లిలో హన్వాడ పోలీసులు ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం వెంకటాపూర్‌కు చెందిన తిరుపతయ్య టిప్పర్‌తో అనుమతి లేకుండా జిల్లా కేంద్రానికి ఇసుకను తరలిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే అక్కడకు వెళ్లిన పోలీసులు టిప్పర్‌ను అదుపులోకి తీసుకొని తిరుపతయ్యపై కేసు నమోదు చేశారు.

రాజాపూర్, న్యూస్‌టుడే: రాజాపూర్ శివారులోని దుందుభి వాగులో ఫిల్టర్ ఇసుక తయారీ కోసం మట్టిని తీస్తున్న పొక్లెయిన్‌ను శుక్రవారం సాయంత్రం సిబ్బంది పట్టుకున్నట్లు ఎస్సై కె.రవి తెలిపారు. పట్టుబడిన పొక్లెయిన్‌ను ఠాణాకు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాగి తీగ చోరీపై కేసు నమోదు

అడ్డాకుల, న్యూస్‌టుడే: మండలంలోని పొన్నకల్ శివారులోని హాలో ఎనర్జీ సోలార్ కంపెనీలో గురువారం రాత్రి రాగి తీగ (కాపర్ వైరు) గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు సిబ్బంది గుర్తించారు. శుక్రవారం సంస్థ మేనేజర్ నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎం.శ్రీనివాస్ తెలిపారు.

IN THE COURT OF THE VII ADDL.SENIOR CIVIL JUDGE & JMFC BENGALURU RURAL DISTRICT AT BENGALURU,
O.S.No. 1708/2021

BETWEEN:
M/s. Vasavi Auto Finance & Chit Funds Rept by its **Proprietor G. Narsimulu** ....**PLANTIFF**
AND
Karthik Reddy Donnur Rept by **GPA Holder Keerthy Mallu** ....**DEFENDANTS**

NOTICE/SUMMONS TO THE DEFENDANT NO.1 To 3

To,
1. Mr.Karthik Reddy Donnur. S/o D Linga Reddy, **2. Mrs.Soniyashri Koochana** W/o Karthik Reddy Donnur. D/o K Rajendra Prasad. Both above Defendant No.1 & 2 are represented by the GPA Holder, i.e., Defendant No.3. 3.**Keerthy Mallu. S/o D.Linga Reddy,** R/at Plot No.32/15, 3rd Main, Shakambari Nagar, J.P.Nagar, 1st phase, Bengaluru-560078. **Also at,** Flat No.240, Srinivasa colony, Mehabooba Nagar, Telangana-569001.

Whereas the above named Plaintiff instituted a suit against you for specific performance of agreement of Sale **Dated: 07.05.2018** and other reliefs.

You are hereby summoned to appear before this Court on **12.11.2024 at 11.am** in person or through advocate to answer the question to the same. Failing which the suit will be heard and determined as ex-parte.

SCHEDULE "A" PROPERTY

All the piece and parcel of the site bearing No.68, Measuring on the eastern side **50.11 feet,** on the western side **50 feet,** on the northern side **55.9 feet** and on the southern side **46 feet,** in all measuring **2525 Square feet**, the said site is carved out of converted land bearing Sy.No.19, presently bearing BBMP Khatha No.01, Sy. No. 19, measuring 4 acre 20 guntas (Converted from agricultural to Non-agricultural) residential use vide official memorandum dated: 18.10.2014, bearing No,. ALN(E)SR/2/2014-15, issued by Deputy Commissioner, Bengaluru Distirct, Bengaluru) plus 9 guntas of Kharab, in the layout Known as "Sri Sai Gardens" situated at Sannathammanahalli Village, K.R.Puram Hobali, earlier Bengaluru south Taluk, presently Bengaluru East Taluk and bounded on the **East by:** Private property, **West by:** Road, **North by:** Site No.69, **South by:** Road.

SCHEDULE PROPERTY (B&C) - SCHEDULE B

250 Sq.ft undivided right, title and interest in the immovable property mentioned in the Schedule A property.

SCHEDULE C

Flat bearing No.102, in the first floor, measuring **1050 Sq.ft**, super built up area containing two bedrooms, together with one covered car parking space, including proportionate share in common areas such as passages,lobbies, lift staircase on Schedule "A" Property known as **"Sree Enclave"** Apartment with other specifications.

Given under by hand and seal of the court, this 1st day of October2024.

Advocate for Plaintiff
Vivekananda V Jalde
Nagesh.M - Advocates,
No.82, 2nd floor, 5th cross,
HIG colony, RMV 2nd stage,
Dollars colony, Bengaluru-560094.

BY ORDER OF THE COURT.
Sd/-
CHIEF MINISTERIAL OFFICE.
Senior Civil Judge Court
Bengaluru Rural Dist, Bangaluru